

## భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి ఆకివీడు

అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తూ విద్యార్థి హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న భాష్యం విద్యా సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ నాయకులు ఎన్.సాయిఫణి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఫణి కుమార్ బృందం భాష్యం త్వరలో ప్రారంభించనున్న పాఠశాల భవన ప్రాంగాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నాయన్నారు. పట్టణంలో ఉయిబీమవరం వెళ్లే రోడ్డులో నిర్మాణ దశలో ఉన్న భవనంలో భాష్యం విద్యాసంస్థలకు చెందిన బ్యానర్లు కట్టి అడ్మిషన్లు ప్రారంభించామని ప్రచారం చేస్తున్నారన్నారు. అయినా మండల విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న భాష్యం విద్యాసంస్థలపై శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.రోహిత్, ఎస్.వెంకట్ పాల్గొన్నారు.



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు



తాడేపల్లిగూడెంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

# రాజ్యాంగ స్ఫూర్తితో హక్కుల రక్షణకు ఉద్యమించాలి

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ స్ఫూర్తితో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కుల రక్షణకు ఉద్యమించాలని కార్మిక, రైతు, వ్యవసాయ, వామపక్ష సంఘాల నేతలు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు, రైతు నల్ల చట్టాలు, అధిక ధరలు, ప్రయివేటీకరణ పేరుతో కేంద్ర పాలకులు దేశ ప్రజలపై దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం భీమవరం అంబేద్కర్ చౌక్ సెంటర్లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ కేంద్ర పాలకులు అంబేద్కర్ విగ్రహాలకు దండలు వేస్తూనే అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మాయ మాటలు చెబుతున్న కేంద్ర పాలకులు వాటిని నిరూపించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఆనంద్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టం చేస్తామని వాగ్దానం చేసి సంవత్సరాలు గడుస్తున్నా మోడీ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని అమలు చేయలేక పోయిందన్నారు. టియుసిసి నాయకులు దండు శ్రీనివాసరాజు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా తోచిన విధంగా నిర్ణయాలు తీసుకుంటూ కేంద్ర పాలకులు రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి. గోపాలన్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో కార్మిక రైతు ప్రజల హక్కులను రక్షించుకోవడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి నాయకులు మల్లుల సీతారాం ప్రసాద్ మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, డి.కళ్యాణి, ఇంజేటి శ్రీనివాస్, ఎం.వైకుంఠరావు, దేగల నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కృష్ణ, రామలింగరాజు, గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.



తణుకులో..



పెంటపాడులో..



ఇరగవరంలో..



లంకలకోడేరులో నిరసన

**తాడేపల్లిగూడెం :** రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కుల పరిరక్షణకై ఉద్యమించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం గెజిట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మన దేశంలో రాజ్యాంగ హక్కులను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు, రైతు వ్యవసాయ నల్ల చట్టాలు, అధిక ధరలు, ప్రయివేటీకరణ పేరుతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలపై దాడి చేయడాన్ని ఖండించారు. లేబర్ కోడ్‌లు అమలు చేయడం వల్ల కార్మికులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని మాయ మాటలు చెబుతున్న ప్రభుత్వాలు వాటిని నిరూపించాలని, లేదంటే కార్మికులకు ఏ విధంగా నష్టం జరుగుతుందో తాము నిరూపిస్తామని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల వెంకటరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. సిఐటియు పట్టణ కన్వీనర్ జవ్వాది శ్రీను, ఎబి.శ్రీనివాస్, తాడికొండ జయరామ్, కొడమంచిలి బాబు, బాదంపూడి శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, కృష్ణ, యాసరపు ఎర్రి నాయుడు పాల్గొన్నారు.

**తణుకు :** లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ ఆందోళనలు ఆగవని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. బుధవారం స్థానిక నరేంద్ర సెంటర్లో దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మిక వర్గం ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం అన్యాయం అన్నారు. చట్టాలకు ఉన్న ప్రాధాన్యత, లేబర్ డిపార్ట్మెంట్‌కు ఉన్న హక్కులు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు కోల్పోతున్నారని తెలిపారు. లేబర్ కోడ్‌లు రద్దు కోసం సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడగర్ల అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్.రామకృష్ణ, ఎం.రమేష్, ఎస్.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, రమణ, దుర్గ ప్రసాద్, బబ్బూరి, మూర్తి, సత్యనారాయణ, శ్రీరామ్, గంగాధర్ రెడ్డి, త్రిమూర్తులు, తరుణ్ తేజ్, వీర బాబు, బ్రహ్మాజీ, పవన్, అయ్యప్ప, శ్రీధర్, మోహన్, శ్రీహర్ష, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

**పెంటపాడు :** రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక హక్కుల పరిరక్షణకై ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా నాయకులు చిర్ల పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా నాయకులు చిర్ల పుల్లారెడ్డి, పెంటపాడు మండల నాయకులు బంకురు నాగేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ జె.శ్యామలా కుమారి మాట్లాడారు. రైతు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు అమలు చేయడం వల్ల ఉద్యోగులకు, కార్మికులకు పెద్ద ఎత్తున నష్టం చేకూరుతుందన్నారు. రాజ్యాంగం స్ఫూర్తితో ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజల హక్కులను రక్షించుకోవడానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల సభ్యులు, రైతు, వ్యవసాయ, కార్మిక, కౌలు రైతు సంఘం నేతలు పాల్గొన్నారు.

**ఇరగవరం:** లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ జె.రామాంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. రామాంజనేయులు, సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి మాట్లాడుతూ పని గంటలను ప్రభుత్వాలు 12 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిల్లి కోటేశ్వరరావు, పెచ్చేటి.సుబ్బారావు, ఎ.పెద్దిరాజు సానబోయిన సత్యనారాయణ, పిల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** కార్మిక కోడ్స్ అమలు నిలుపుదల చేసి హక్కులు కాపాడాలని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లంకలకోడేరు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాడి సాధించిన హక్కులు ను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి కోడ్‌లు తెచ్చిందన్నారు. దేశ వ్యాప్త నిరసనలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేగి రతయ్య, తాడి వెంకటేష్, యోగానందం, రామకృష్ణ, శ్రీను, పెద్దిరాజు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కృషి

## రైతన్న మీకోసంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రైతును ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు అన్నారు. కుముదవల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కుముదవల్లిలోని రైతు భూపతిరాజు సత్యనారాయణ మండువా పెంకుటిల్లు అరుగుపై ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి రైతులతో కలిసి అరుగుపై కూర్చుని ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇంటికి వచ్చి యాప్‌ను ప్రతి రైతు మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసి ఇవ్వడంతో పాటు, యాప్ ద్వారా సమాచారాన్ని సులభంగా ఎలా తెలుసుకోవచ్చో చూపిస్తారని, శ్రద్ధగా నేర్చుకోవాలి అన్నారు. జిల్లాలో ఇప్పటికే డ్రోన్లు అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. వ్యవసాయ కూలీలు దొరకడం కష్టంగా ఉండడంతో పాటు, ఖర్చు కూడా ఎక్కువ అవుతుందని, డ్రోన్ల వినియోగంతో ఖర్చు తగ్గుతుందని, సమయం ఆదావుతుందని, పంటపై పిచికారీ చేసే మందుల ప్రయోజనం నూరు శాతం లభిస్తుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ రైతుల ఇంటి స్వయంగా వెళ్లి 'రైతన్న మీకోసం, రైతు సేవలో మన మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు రైతన్న మీకోసం కార్యక్రమం ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎడిఎ కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఎఒ సంధ్య, విఎఎ పావని, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎం.రఘు, ఎంపిడిఒ రెడ్డియ్య, పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కె.నాగరాజు పాల్గొన్నారు.



రైతులకు కరపత్రాలు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి, సర్పంచి వంశీకృష్ణంరాజు

# రాజ్యాంగ లక్ష్యాలను కాపాడాలి

## పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

భారత రాజ్యాంగ లక్ష్యాలు కాపాడడమే రాజ్యాంగ దినోత్సవ ఉద్దేశమని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరం గునిపూడిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే కొన్ని చట్టాలు చేసిందని, వాటి ప్రకారం సాధారణ ప్రజానీకానికి సమాన విద్యావకాశాలు, నాణ్యమైన వైద్యం, అందరికీ పని వంటి అవకాశాలు ప్రభుత్వాలు కల్పించాలన్నారు. కార్మికుల హక్కుల కోసం రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్‌లు కేంద్ర ప్రభుత్వం తీసుకుని రావడం రాజ్యాంగ విలువలను తగ్గించడమేనని తెలిపారు. వెంటనే లేబర్ కోడ్‌లు రద్దు చేసి రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను కాపాడాలని కోరారు. ఎంఎల్‌సి వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

# ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి : జెసి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి రంగరాజు రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లు యజమానులతో మాట్లాడారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలన్నారు. ధాన్యంతో వచ్చిన వాహనాలను వెంటనే దిగుమతి చేయాల న్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకూ ఎంత ధాన్యం కొనుగోలు జరిగింది స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం త్వరితగతిన దిగుమతి చేసుకొని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైస్‌మిల్లు యజమానులు కస్టోడియన్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ట్రక్ షీట్ వివరాలను కస్టోడియన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లు ఆవరణలో ధాన్యం బస్తాల స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, డిటి నాగదేవి, రైస్ మిల్లు యజమాని రంగరాజు ఉన్నారు

**పెనుమంట్ర :** రైస్ మిల్లుల వద్ద ఆలస్యం లేకుండా ధాన్యం లోడులు దిగుమతి చేసి ఆయా వాహనాలను వెంటనే పంపేయాలని రైస్ మిల్లర్స్ కస్టోడియన్ సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆలమూరులోని విష్ణుశ్రీ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రయివేటు లిమిటెడ్‌ను జెసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రక్ షీట్లను, రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు సరాసరి ఎన్ని లోడ్లు వస్తున్నాయని ఆరా తీశారు. జెసి మాట్లాడుతూ వచ్చిన ధాన్యం వాహనాలను దిగుమతి చేయకుండా పెండింగ్ పెడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఏమైనా సమస్యలుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కానీ, తన దృష్టికి గానీ తెలపాలన్నారు.

# కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

## రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడినేలల పరిరక్షణ పేరుతో పదో కాంటూరుకు పెంచరాదని, కొల్లేరు ప్రజలు, రైతుల జీవించే హక్కు కాపాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏలూరు కెనాల్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కొల్లేరు ప్రజలు, రైతుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎ.రవి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బి.బలరాం మాట్లాడుతూ 120 జిఒ కొల్లేరు ప్రజల జీవితాలను నాశనం చేసిందని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని ఎన్నికల సందర్భంగా ఓట్లు కోసం హామీలిచ్చే రాజకీయ పార్టీలు గట్టు చేరాక బోడి మల్లన్న చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని తెలిపారు. గతంలో చేపల చెరువులు తవ్వకూడదన్న ప్రభుత్వాలు నేడు వరిసాగు కూడా చేయకూడదని నిర్బంధానికి పాల్పడుతోందని ఆరోపించారు. 146 సొసైటీలు ఏర్పాటు చేసి 7100 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వకపోతే ఊరుకోబోమని ఆనాటి వెంగళరావు ప్రభుత్వం ఒత్తిడి చేసిందని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వాలు దానికి భిన్నంగా మీరు చేపల చెరువులే కాదు, వ్యవసాయం కూడా చేయకూడదని ఆంక్షలు విధిస్తున్నాయన్నారు. ఇప్పటికే కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట కూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారని తెలిపారు. 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేసిన సందర్భంలో కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని విమర్శించారు. కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్ళినప్పుడు కొల్లేరు ప్రజలు, రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడం అన్యాయమన్నారు. ఇప్పుడు మూడో కాంటూరు పరిస్థితి నుండి ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్ట దిగ్బంధనం చేసి పూర్తిగా అటవీశాఖ చేతుల్లోకి పెట్టబోతున్నారని తెలిపారు. ఇదే అమలైతే కొల్లేరు ప్రాంతమైన నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు, ఉండి, కాళ్ల, గణపవరం, పెంటపాడు మండలాల్లోని సుమారు 115 గ్రామాలపై ఈ ప్రభావం పడుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు తూతూమంత్రంగా అభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమని, ఎకోసెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎస్.గాయత్రి, చేపల రైతుల సంఘం రాష్ట్ర నాయకులు నంబూరి వెంకటరామరాజు, మాజీ సర్పంచి ఘంటశాల మహాలక్ష్మిరాజు మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, దీనికి గతంలో అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని, మోడీ ఇచ్చిన హామీని అమలు చేయాలని, కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని, 146 సొసైటీలు పునరుద్ధరించాలని, 14,800 ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదార్లకు అప్పగించాలని కోరారు. ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ పేరుతో 10వ కాంటూరుకు విస్తరించరాదని, కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీ అమలు చేయాలని, ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, ఆపరేషన్ కొల్లేరులో తీవ్రంగా నష్టపోయిన సొసైటీలు, జిరాయితీ రైతులు, వృత్తిదారులకు నష్టపరిహారం చెల్లించాలని, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో ఇటీవల (అన్సర్వే, దొడ్డిగట్టు భూముల్లో) ఆపుచేసిన వరిసాగుకు అనుమతినివ్వాలని, అటవీ అధికారుల వేధింపులు, అవినీతి అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కొల్లేరు సమస్యపై రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యమై కార్యాచరణకు పూనుకోవాలని, అందులో ఒకపక్క న్యాయపరంగా, మరోపక్క ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా సంతకాల సేకరణ, తీర్మానాలు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు ఎంఎస్ఎస్.గంగాధర్, ఎం.కొండలరావు, జి.పార్థసారథి, జి.ఖ్యాతి పుష్పశ్రీ, ఎ.కాశీరాజు తదితరులు మాట్లాడారు. సమావేశానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆహ్వానంగా పలకగా, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.మహంకాళిరావు, రైతుసంఘం నాయకులు కట్టా భాస్కరరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బలరాం

# ప్రతిష్టాత్మకంగా బాలల సంబరాలు

## ఎస్ఆర్‌కెఆర్‌లో 12 ,13వ తేదీల్లో సంబరాల నిర్వహణ

ప్రజాశక్తి - భీమవరం


భీమవరంలో ప్రతిష్టాత్మకంగా మూడో బాలల సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భీమవరం బాలోత్సవ నిర్వహణ కమిటీ తెలిపింది. భీమవరం బాలోత్సవాల పేరిట చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా ఈ సంబరాలు చేస్తున్నట్లు తెలిపింది. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో డిసెంబర్ 12, 13 తేదీల్లో బాలల సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం బాలోత్సవాల నిర్వహణ కమిటీ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవానికి సంబంధించి బ్రోచర్, కరపత్రాలను నిర్వహణ కమిటీ ఆవిష్కరించింది. అనంతరం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాద్ రాజు మాట్లాడారు. బాల బాలికల్లో సృజనాత్మకత, వికాసం పెంపొందించేందుకు కల్చరల్, అకడమిక్ అంశాలకు పెద్ద పేట వేస్తున్నామన్నారు. భీమవరం పట్టణం, భీమవరం రూరల్ వీరవాసరం, పాలకోడేరు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాలనుండి సుమారు రోజుకు 2,500 మంది బాల బాలికలు బాలోత్సవంలో పాల్గొనేందుకు కావాల్సిన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఈవెంట్‌లో బెస్ట్ ఆఫ్ ఫోర్ ఎంపిక చేసి ప్రశంసా పత్రం బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. భీమవరం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం బాలోత్సవంలో 18 కల్చరల్, 15 ఆకాడమిక్ అంశాల్లో బాలోత్సవాలు నిర్వహిచడం జరుగుతుందన్నారు. పది రోజుల నుండి అప్లికేషన్లు భీమవరం రూరల్, టౌన్, వీరవాసరం, పాలకోడేరు, కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాలకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి చేసిన అప్లికేషన్లు ఈనెల 30వ తేదీలోగా భీమవరం బాలోత్సవం భవనం (శ్రీరాంపురంలోనికస్తూరిబా గాంధీ భవనం, యుటిఎఫ్ జిల్లా కార్యాలయం)లో స్వయంగా గానీ, బాలోత్సవం బాధ్యుల ద్వారా గానీ అందజేయాలన్నారు. భీమవరం బాలోత్సవం ఉపాధ్యక్షుడు గాతల జేమ్స్, కల్చరల్ కమిటీ కన్వీనర్ బి.చైతన్య ప్రసాద్, అకాడమిక్ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, జి.రామకృష్ణంరాజు, మల్లుల శ్రీనివాస్, జిల్లా ట్రెజరీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు యువి.పాండురంగారావు పాల్గొన్నారు.



బాలోత్సవాల బ్రోచర్లను ప్రారంభిస్తున్న నిర్వహణ కమిటీ

# ఉద్దరాజు రామం చిరస్మరణీయుడు

## వర్ధంతి సభలో నేతలు



యలమంచిలి ఉద్దరాజు రామం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ ఉద్దరాజు రామం చిరస్మరణీయుడని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. బుధవారం చించినాడ అమరవీరుల స్మారక భవనం వద్ద రామం 31వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం సీనియర్ నేత దేవ సుధాకర్ అధ్యక్షత వహించారు. సభలో బాలరాజు మాట్లాడుతూ పాలకొల్లు మండలం మారుమూల గ్రామం వాలమర్రులో పుట్టి పెరిగిన ఉద్దరాజు రామం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడం ద్వారా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా, నరసాపురం ఎంపీగా పని చేశారంటే చిన్న విషయం కాదని తెలిపారు. దాని వెనుక ఆయన పోరాట పటిమ ఏ పాటిదో అర్ధమవుతుందని తెలిపారు. ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోవడంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. ముందుగా రామం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, ఆకుమర్తి యేసు రత్నం, శెట్టిమి భాస్కరరావు, తాడి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


**ఆచంట:** నీతి, నిజాయతీ, నిబద్ధత విలువలతో కూడిన నిస్వార్థపరుడు ఉద్దరాజు రామం అని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. ఉద్దరాజు రామం వర్ధంతి ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యానారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు తలుపురి బుల్లబ్బాయి మాట్లాడుతూ రామం రైతు ఉద్యమ నిర్మాతగా అఖిల భారత కిసాన్ సభకు అధ్యక్షులుగా పనిచేసి రైతు సమస్యలపై పోరాడి మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. గోదావరి జలాల వినియోగానికి చక్కటి మార్గం చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో బండి రంగారావు, కుష్మే జయరాజు, సిర్రా విఘ్నేశ్వరుడు, రొక్కాల దేవదానం పాల్గొన్నారు.

**పెనుగొండ:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, రైతు ఉద్యమ నిర్మాత, అఖిల భారత కిసాన్ సభకు ఆల్ ఇండియా అధ్యక్షులు ఉద్దరాజు రామం వర్ధంతి సభ పెనుగొండ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా, పట్టణ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాదుషా మాట్లాడుతూ నరసాపురం పార్లమెంటు సభ్యునిగా పనిచేసిన ఆయన సముద్రం పాలవుతున్న గోదావరి జలాల వినియోగానికి చక్కటి మార్గం చూపారన్నారు. విలువలతో కూడిన మచ్చలేని నిస్వార్థ జీవితం రామం సొంతమని తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు నీలాపు ఆదినారాయణ, పులిదిండి రామారావు, శీలం ఏసు, జి.వరహాలు రెడ్డి, బి.నేతాజీ, పాల్గొన్నారు.

# ఉండి ఎంఇఒ-1 నిర్లక్ష్య వైఖరికి నిరసన

## విద్యాశాఖ కార్యాలయాల వద్ద ధర్నాకు కార్యాచరణ

**భీమవరం:** ఉండి ఎంఇఒ-1 నిర్లక్ష్య వైఖరికి నిరసనగా యుటిఎఫ్ ఆందోళనకు శ్రీకారం చుట్టింది. ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు పిలుపునిచ్చింది. ఈ మేరకు కలెక్టరేట్లో డిఇఒ ఇ.నారాయణకు యుటిఎఫ్ నేతలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు ఉండి ఎంఇఒ-1 ఉపాధ్యాయులు పట్ల వ్యవహరిస్తున్న తీరు, ఏర్పడిన సమస్యలను డిఇఒ నారాయణకు వివరించారు. ఉపాధ్యాయుల ఫోన్లు ఎత్తకపోవడం, మెడికల్ బిల్లులు ఉద్దేశపూర్వకంగా మంజూరు చేయకుండా నిలుపుదల చేయడం, లీవుల మంజూరులో ఇబ్బంది పెట్టడం, డిడిఒ సంతకాల కోసం కార్యాలయాల తిప్పించుకోవడం, ఎంపిఎస్ ఉపాధ్యాయులకు జీతాలు సక్రమంగా చేయకపోవడం వంటి ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారన్నారు. ఆయన తీరుకు నిరసిస్తూ ఆందోళన చేపడుతున్నామని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో డిసెంబర్ 2న పెద్ద ఎత్తున ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా కార్యదర్శులు బాబ్జి, రామకృష్ణంరాజు, మండల అధ్యక్షులు వామనమూర్తి, గౌరవాధ్యక్షులు శివరామరాజు జిల్లా కౌన్సిలర్ భవానీ ప్రసాద్, స్వామి, నాగబాబు, త్రిమూర్తులు ఉన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

## రోడ్ల పరిశీలన

**వీరవాసరం:** వీరవాసరంలో రోడ్లపై రోడ్లు వేశారంటూ ఆలీహుస్సేన్ చేసిన ఫిర్యాదు మేరకు ఎంపిడిఒ వైభవతి వీరవాసరం ఒకటవ వార్డులో సీసీ రోడ్డును బుధవారం పరిశీలించారు. రోడ్లపై రోడ్లు వేస్తున్నారంటూ అనేక శీర్షికతో ప్రజాశక్తిలో కథనాలను ప్రచురించడం జరిగింది. దీంతో గ్రామంలో ఇంకా ఉన్న మట్టి రహదారులకు ప్రాధాన్యత ఇవ్వకుండా పటిష్టంగా ఉన్న సీసీ రోడ్లపైనే సీసీ రోడ్లు ఏవిధంగా వేస్తున్నారంటూ ఆలీహుస్సేన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వాస్తవాలేమిటో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం పట్ల ఫిర్యాదుదారుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు. దీంతో ఉద్దేశపూర్వకంగానే అధికారులు ఫిర్యాదును పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారంటూ ఆలీ హుస్సేన్ ఆరోపించాడు. ఇదిలా ఉంటే పంచాయతీ రాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు కొంత మంది వారి కింది స్థాయి అధికారులపై ఒత్తిడి చేసిన నిబంధనలకు విరుద్ధంగా తమతో తప్పిదాలు చేయిస్తున్నారంటూ వాపోతున్నారు. ఇదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు పైనే మరోసారి సీసీ రోడ్లు వేయడం మండలంలో చర్చనీయాంసంగా మారింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఒత్తిడి వల్ల జరిగిన తప్పిదాలు తమ మెడకు చుట్టుకుంటున్నాయని కింది స్థాయి అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

**పాలకొల్లు రూరల్:** మండలంలోని వరిధనం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 100 కెవి, ఎస్‌సి హరిజన పేట అంబేద్కర్ బొమ్మ వద్ద 16 కెవి, పెచ్చెట్టి పాలెం ఇంద్రమ్మ కాలనీలో 16 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, విద్యుత్ శాఖ ఎడి రామకృష్ణ, లైన్మెన్ శివ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు పాముల రజినీకుమార్, గ్రామ అధ్యక్షులు పోతుల సూరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు ద్రాక్షరపు జ్యోతి, పెచ్చెట్టి నాగరాజు పాల్గొన్నారు.

## వాణిజ్య పంటలనూ పండించాలి

**తహశీల్దార్ కావడి నాగార్జున**

**ఉండి:** రైతులు ఆహార పంటలతో పాటు వాణిజ్య పంటలను పండించినట్లయితే అధిక లాభాలను పొందవచ్చునని మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. బుధవారం మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో గ్రామ వ్యవసాయాధికారి శిరీష ఆధ్వర్యాన నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో నాగార్జున పాల్గొని మాట్లాడుతూ రైతులు ప్రజలకు ఉపయోగపడే రకాలను పంటలుగా పండించాలని, దానివల్ల రైతు ఆర్థికంగా బలోపేతం కావడమే కాకుండా ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులకు గురికాదని అన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఎరువుల ధరలు అధికంగా పెంచేయడంతోనే పంట పెట్టుబడి పెరిగిపోయిందని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర లేక తాము నష్టపోతున్నామని వాపోయారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాస్, సిబ్బంది శ్రీను, బాబ్జి పలువురు రైతులు ఉన్నారు.

**ఆచంట :** రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రత్యేక యాప్ ను తయారు చేయడం జరిగిందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొల్లు ఎడిఎ పి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని వల్లూరు, కందరవల్లి గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ఆచంట జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, కందరవల్లి గ్రామ సర్పంచి బోడపాటి బుల్లయ్య, వైస్ ఎంపిపిలు తాళం శ్రీనివాసు పాల్గొన్నారు.

## జై కిసాన్ బ్రాండ్‌ను వినియోగించుకోవాలి : ఎడిఎ

**తాడేపల్లిగూడెం:** యూరియాకు ప్రత్యామ్నాయంగా అమోనియం సల్ఫేట్‌ను జై కిసాన్ బ్రాండ్ విడుదల చేసిందని తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ ఎడిఎ ఆర్.గంగాధర్ రావు తెలిపారు. తాడేపల్లిగూడెం రైల్వే గుడ్స్ షెడ్ వద్ద పరదీప్ సొసైటీ లిమిటెడ్ కేకే బిర్లా కంపెనీ వారి 2 వేల టన్నుల అమోనియం సల్ఫేట్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు, ఎరువులు పురుగుమందుల డీలర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈతకోట తాతాజీ మాట్లాడుతూ రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ ఎరువును దేశంలో రెండు కంపెనీలు మాత్రమే తయారు చేస్తున్నాయని, ఇప్పుడు నూతనంగా జై కిసాన్ బ్రాండ్ మూడో కంపెనీగా ఈ అమోనియం సల్ఫేట్ తయారు చేస్తుందని తాతాజీ పేర్కొన్నారు. వాణిజ్య పంటలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో పరదీప్ సొసైటీ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ మహమ్మద్ రఫీ కుమార్, డీలర్లు దూలం శ్రీనివాసరావు, మైలవరపు గోపాలకృష్ణ, వెజ్ దుర్గాప్రసాద్, ఈతకోట చంద్రకాంత్, చిన్ని నారాయణ పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

**కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మకు ఎస్‌టియు నేతల వినతి**

**భీమవరం :** ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ కోరారు. భీమవరంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మకు ఎస్‌టియు నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ రాయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎస్‌టియు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురి చేయకుండా ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్నారు. కేంద్ర మంత్రి ప్రభుత్వంతో మాట్లాడి సుప్రీంకోర్టులో రివ్యూ పిటేషన్ వేసేలాగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

**తాడేపల్లిగూడెం:** ఏ చట్టమైన రాజ్యాంగానికి లోబడే ఉంటుందని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మనకు ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్రం, హక్కులు, బాధ్యతలు గురించి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కిరణ్‌శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లలితా దేవి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నా మణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయకృష్ణ పాల్గొన్నారు.

## మరోసారి కెనరా బ్యాంక్ దాతృత్వం

**ఉండి:** మండలంలోని మహదేవపట్నం గ్రామ శివారు ఉత్తరపాలెం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.70 వేల నిధులు కేటాయించి కెనరా బ్యాంక్ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకుంది. ఇప్పటికే నియోజకవర్గంలోని 25 గ్రామాలలో మైక్రో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేసి నియోజకవర్గం అభివృద్ధిలో కెనరా బ్యాంక్ ఎమ్‌డి కలిదిండి సత్యనారాయణ రాజు తన వంతు బాధ్యతను నిర్వర్తించారు. గురువారం భోజనశాల నిర్మాణానికి పూనుకుని అతి త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

## విద్యార్థులకు నైతిక విలువలు ఉండాలి : ఎంఇఒ

**గణపవరం:** విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలతో ఉండాలని గణపవరం రెండవ ఎంఇఒ జి.బాలయ్య అన్నారు. కొత్తపల్లిలో జరుగుతున్న ఎన్ఎస్-ఎస్ వలంటీర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే మానవ విలువలు పెంచుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, పోగ్రాం ఆఫీసర్ జి.వెంకటరమణ, యుపి స్కూల్ హెచ్‌ఎం ఎం.సాగర్ పాల్గొన్నారు.

## వల్లూరులో మాక్ అసెంబ్లీ

**ఆచంట:** మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, వల్లూరు ఎంపీ పాలెం లో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని నమూనా మాక్ అసెంబ్లీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో చక్కగా మాటల తూటలతో, ప్రశ్నల వర్షాలతో కూడిన ప్రసంగాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నేలపాటి బేబీ రామ్మోహన్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు జోగి జోన్స్ కుమార్, హెచ్‌ఎం ఆకన రామకృష్ణ ఉన్నారు.

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి - నరసాపురం

సంస్థాగతంగా బలోపేతం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎఐసిసి పరిశీలకులు, పంజాబ్ మాజీ ఎంపీ జస్బీర్సింగ్ దింపా చెప్పారు. పట్టణంలోని సన్ రైజ్ హోటల్లో ఆయన విలేకర్లతో మాట్లాడూతూ రాష్ట్రంలో పిసిసి పనితీరుతో పాటు కాంగ్రెస్ నాయకులంతా కష్టపడి పని చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమారాజు, పోలిశెట్టి బాబ్జి, గాదిరెడ్డి వనమయ్య పాల్గొన్నారు.

## కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పెదమైనవాని లంక గ్రామంలో బుధవారం కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసినట్లు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి ఐదు కోడి పుంజులు, మూడు ఫోన్స్, రెండు కత్తులు, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.




# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

## పలుచోట్ల ఘనంగా రాజ్యాంగ దినోత్సవం - డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భీమవరం మండలం రూరల్ వెంప గ్రామం పెదపేటలో బుధవారం భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ప్రెసిడెంట్ ఇంజేటి ప్రభాకర్ రావు, వైస్ ప్రెసిడెంట్ ఇంజేటి త్రిమూర్తులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు కాటికి రాజబాబు, తాటిపాక సుజ్ఞాన్ రాజ్, మంద ఏసోబు, చిలకపాటి అబ్రహం, వర్ధనపు రాంబాబు, కూరం మార్క్, వర్ధనపు కన్నపుదాసు ఉన్నారు.


ఏలూరుపాడులో నివాళు లర్పిస్తున్న నేతలు

**కాళ్ల :** వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను, అఖండతను తప్పక సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుటకు సత్యనిష్టాపూర్వకంగా తీర్మానించుకొని నవంబర్ 26, 1949న మన రాజ్యాంగ పరిషత్తులో పరిగ్రహించి శాసనంగా రూపొందించుకున్నదని భారత రాజ్యాంగమని అంబేద్కర్ ఆశయం సాధన కమిటి ఫౌండర్ అండ్ ఛైర్మన్ కోనా జోసెఫ్ అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గారాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.


**ఇరగవరం :** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో సత్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసు అంబేద్కర్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సిబ్బంది ఉన్నారు.

**గణపవరం :** రాజ్యాంగంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని గణపవరం లయన్స్ క్లబ్ నాయకులు కాకర్లవినాయక అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన స్థానిక పాఠశాల విద్యార్థుల పరీక్షలకు ఉపయోగపడే ప్యాడ్‌లు అందజేశారు. రాజ్యాంగ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోశాధికారి సత్యనారాయణ మూర్తి, నారాయణ నాగపండు ఆర్థిక సహకారం చేసిన వంకాయల నాగపండు పాల్గొన్నారు.


డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలు అందరూ ఆచరించాలన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కె.గణేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ పిఒలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** ఎపి నిట్‌లోని పరిపాలనా భవనం వద్ద భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగమని తెలిపారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీన్లు డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వీరేశ్ కుమార్, అసోసియేట్ డీన్లు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసన్, ఆచార్యులు పాల్గొన్నారు.

**ఆచంట :** నవ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్ని తరగతుల ఆరాధ్యులని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు చిన్నం ఏడుకొండలు అన్నారు. ఆచంటలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆచంట సర్పంచి కోట సరోజినీ, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పిల్లి రుద్రప్రసాద్, కోటే శశిమధు, కోట గిరిధర్, రొక్కాల బన్ను, పెచ్చెట్టి సత్యనారాయణ, దొమ్మేటి రాంబాబు, గుబ్బల రామకృష్ణ, కారెం చినబాబు, బొరుసు రాంబాబు, మెండే శ్రీను, మధు పాల్గొన్నారు.


పెనుగొండ: ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నేతలు

**ఉండి:** భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే దిక్సూచిగా మారిందని ఉండి మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు, వాండ్రం సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. మండల వ్యాప్తంగా బుధవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాండ్రం గ్రామపంచాయతీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో దాసరి వెంకటకృష్ణ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


యలమంచిలిలో..

**యలమంచిలి :** రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఎల్‌పిఎఫ్ ఛైర్మన్ డాక్టర్ ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ బుధవారం కొంతేరు గ్రామం లో సంబరాలు ఏర్పాటు చేశారు. మొదటిగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తదనంతరం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న జి.చిన సత్యనారాయణను సాలువా, పూలమాలతో సత్కరించి ఉత్తమ ప్రజా సేవకుడు అవార్డును బహూకరించారు. ఎలిమెంటరీ స్కూల్ పిల్లలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆకుల యోసేపు, ఉన్నమట్ల రాజమోహన్, కొయ్యే సహదేవుడు, ఉన్నమట్ల విజయ్‌రాజ్, ఆడాపు రమేష్, గొల్లమందుల కమలాకర్, డేనియెల్, బ్రహ్మ, ఎల్‌పిఎఫ్ సభ్యులు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మండల కేంద్రం మొగల్తూరు గ్రామాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, గ్రామాల్లోని సచివాలయాల్లో భారత రాజ్యాంగం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**ఆకివీడు :** ప్రతి ఒక్క విద్యార్థి రాజ్యాంగ ప్రవేశిక పీఠికను చదవవలసిన అవసరం ఉందని, రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత సూచించారు. మండలంలోని దుంపగడప డిగ్రీ కళాశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యోగేశ్వరరావు, డాక్టర్ ఆనంద్‌కుమార్, టి.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

**రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : సిపిఎం**

**పెనుగొండ:** భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో ప్రజలు త్యాగాలకు సిద్ధమవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మత పాలక వర్గాలు దేశ ఐక్యతను దెబ్బతీసే విధంగా లౌకిక, సామ్యవాద పదాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అనంతరం సభ్యులు రాజ్యాంగ పీఠిక చదివి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌కె.పాదుషా, పట్టణ కార్యదర్శి నాగశెట్టి గంగారావు, నీలాపు ఆదినారాయణ, పులిదిండి రామారావు, బుల్లోజు నేతాజీ, శీలం ఏసు, జి.వరహాలు రెడ్డి పాల్గొన్నారు.

**యలమంచిలి :** మండలంలోని చించినాడ సెంటర్‌లో గల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కానేటి బాలరాజు, దేవ సుధాకర్, బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన అనేక హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి సుగుణ, ఆకుమర్తి ఏసురత్నం, శెట్టిమి భాస్కరరావు, తాడి ఉదయ్, బోసు, భాషా పాల్గొన్నారు.


గణపవరంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన..

**కెవిపిఎస్ ఆధ్వర్యాన..**

**ఉండి:** అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు జరిగితేనే అంబేద్కర్ కు నిజమైన నివాళి అని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అన్నారు. మండలంలోని పాందువ్వ గ్రామంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దాగారపు గోపాలం, పలువురు కెవిపిఎస్ సభ్యులు పాల్గొన్నారు.

**గణపవరం :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరుస్తుందని కెవిపిఎస్ జిల్లా సహాయకార్యదర్శి చిన్నం చిననాగేశ్వరావు అన్నారు. అర్ధవరం అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం కెవిపిఎస్ నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శీలంరమేష్ బాబు, కట్టూరి ప్రసాద్, అద్దంకి రాజేందర్, అద్దంకి హసాన్న, ఎరిచర్ల కుమార్, సిరానవీన్ వర్మ, పందిరి కాంతారావు పాల్గొన్నారు.

**తణుకు :** ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ దేశానికి దిశా దశ నిర్దేశించారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**నరసాపురం:** పట్టణ, మండలంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పూలమాలలు వేశారు. టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు నక్కా ఆనందబాబు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కమ్యూనిటి భవనంలో రాజ్యాంగంపై నిర్వహించిన సదస్సుకు ఆర్‌డిఒ దాసిరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పాలూరి బాబ్జీ, సంకు భాస్కర్, కొలచన పద్మ పాల్గొన్నారు.

10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి న్యాయశాఖ ఉద్యోగులతో భారత రాజ్యాంగ ప్రవేశానికి ప్రమాణ పూర్వకంగా అందరిచేత చదివించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రి.జూ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

యుకె వనితాక్లబ్ ఆధ్వర్యాన అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి శిరిగినీడి పూలమాల వేసి నివాళులర్పించారు. వనితాక్లబ్ కార్యదర్శి రంగినీడి భరణి, కోశాధికారి మణికర్ణిక, సభ్యులు పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** మార్టేరు వరి పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో వ్యవసాయ పాలిటెక్నికల్, వ్యవసాయ పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ టి.శ్రీనివాస్, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

**పెనుగొండ :** భారతదేశ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పెనుగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచి నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అధ్యక్షతన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

**రేపు ప్రమాణస్వీకారం**


శివరామరాజు

**కాళ్ల:** కాళ్లకూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి రాష్ట్రప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమించింది. ఈ సందర్భంగా బుధవారం ధర్మకర్తల మండలి పాలకవర్గ సభ్యులు శ్రీ వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నూతన ఛైర్మన్‌గా నియమితులైన అడ్డాల శివరామరాజు మాట్లాడుతూ ఆలయానికి పాలక మండలిని నియమించడంలో చొరవ చూపినందుకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 28వ తేదీ శుక్రవారం ధర్మకర్తల మండలి పాలక వర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందని, ఈ కార్యక్రమానికి యాత్రికులు, దాతలు, కూటమి నాయకులు కాళ్లకూరు తరలి రావాలని కోరారు. ధర్మకర్తలుగా నడింపల్లి వెంకట రామరాజు, ఎం.తిరుమల లక్ష్మి నరసింహ శ్రీకాంత్, తుమ్మపూడి లక్ష్మి, యాతం వెంకట సుబ్బారావు, ఉగ్గల్ల లక్ష్మణరావు, యిర్రింకి జగన్‌మోహనకృష్ణ, లంక శశి రేఖ, కట్టా భువనేశ్వరి, చిటికిన అనంతలక్ష్మి, ఎత్తుల అప్పలసూరమ్మలను నియమించారు.

## మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను వినియోగించుకోవాలి

**ఆచంట:** మండల పరిసర ప్రాంతాల ప్రజలందరూ 24 గంటలూ సేవలందించేందుకు ఆధ్య మల్టీ స్పెషాలిటీ, పిల్లల హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్.పావని అన్నారు. బుధవారం ఆచంటలో ఆధ్య మల్టీ స్పెషాలిటీ, చిన్నపిల్లల హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు సంతానలేమి, హార్మోన్స్, గర్భాశయం, థైరాయిడ్ హైబిపి, మూత్రంలో మంట ఇన్ఫెక్షన్, ఉమ్మనీరు తక్కువగా ఉండటం నార్మల్ డెలివరీ, సిజేరియన్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ, డెలివరీలు కోత, కుట్లు లేకుండా అధునాతన టెక్నాలజీతో లాప్రోస్కోపిక్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలను, అప్పుడే పుట్టిన పిల్లలు ఉమ్మనీరు మింగిన, చిన్నపిల్లల్లో వచ్చే కామెర్లు, మూత్రనాళాల ఇన్ఫెక్షన్లు, తరచూ వాంతులు, విరోచనాలు, ఆస్తమా నిమోనియా విష జ్వరాలపై అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్లలోపు పిల్లల వరకు 24 గంటలు అందుబాటులో ఉండే సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠశాలలో హింసా వ్యతిరేక దినోత్సవం

**తణుకు:** ప్రపంచ వ్యాప్తంగా నిత్యం మహిళలు ఎక్కడో ఒక చోట ఏదో ఒక రకమైన హింసకు, అవమానాలకు, అకృత్యాలకు, హత్యలకు గురౌతూనే ఉన్నారని మహిళా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. హింసా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా బుధవారం ఇరగవరం రోడ్డులో ఉన్న హాస్టల్‌లో, ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఉన్న పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అజయకుమారి మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్లపై పని ప్రదేశాల్లో అనేకమైన దాడులు, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయన్నారు. మహిళలకు రాత్రి పూట షిఫ్టులు వేసి పని చేయించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. మహిళల హక్కులు, సమానత్వం, మహిళా సాధికారత, కనీసవేతనాలు, సార్వభౌమత్వం ఇవన్నీ రాజ్యాంగ విలువలతో కూడినవని గుర్తు చేశారు. గాంధీజీ మహిళల పట్ల కన్న కలలు నిరుపయోగంగా మారాయని వాపోయారు. మహిళలు అర్ధరాత్రి కూడా స్వేచ్ఛగా తిరగిన నాడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు గాంధీ చెప్పిన సందేశాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగంపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ మెట్రిన్ ఎం.రవీంద్రభారతి, సిహెచ్.కళ్యాణి, వెంకటలక్ష్మీ, కాశీ అన్నపూర్ణ, సంధ్య మల్లిపూడి సుస్మిత పాల్గొన్నారు.

## పలుచోట్ల షష్ఠి ఉత్సవాలు


ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని గొల్లవాని తిప్ప గ్రామంలోని శ్రీవల్లి సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని పలు ఆలయాల్లో తెల్లవారుజాము నుండి ప్రజలు బారులు తీరారు. ఆయా ఆలయాల వద్ద పులిహోర తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు. భారీ అన్న సమారాధన చేశారు.

**పాలకొల్లు :** పాలకొల్లు పట్టణంలోని శృంగేరి పీఠం శ్రీశంభేశ్వరి స్వామి ఆలయంలో శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం రాత్రి వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వైసిపి నేతలు గుడాల గోపి, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ తదితరులు ఆలయాన్ని సందర్శించారు.

**తాడేపల్లిగూడెం :** మండలంలోని మోదుగగుంట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బుధవారం తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. అనంతరం షష్ఠి మహోత్సవాల్లో భాగంగా జరుగు అన్నదాన కార్యక్రమానికి రూ.10 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.


నరసాపురంలో : విప్ బొలిశెట్టి, చాగంటి

**నరసాపురం:** పట్టణ, మండలంలోని సుబ్రమణేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాల వద్ద క్యూ కట్టారు. లక్ష్మణేశ్వరం, రుస్తుంబాద, లిఖితపూడి, పట్టణంలోని కపిలమల్లేశ్వరస్వామి ఆలయాల్లోని స్వామివార్ని దర్శించుకున్నారు. ఇటు లక్ష్మణేశ్వరస్వామి ఆలయం వద్ద చాగంటి ఉమానాయుడు ట్రస్టు ఆధ్వర్యాన డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్ధసారధి ఆధ్వర్యాన అఖండ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 25 వేల మంది పాల్గొన్నారు. ఇటు ఆలయాన్ని ప్రభుత్వ విప్‌లు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ ఘంటసాల వెంకటలక్ష్మి, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఆర్‌డిఒ దాసిరాజు దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ వెన్నా బాబూరావు, జక్కం శ్రీమన్నారాయణ, ఇఒ ఆర్‌వివిఎస్.రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

## ఎరువులు సిద్ధం చేయాలి : జెసి

**భీమవరం :** రబీ పంటకు కావలసిన ఎరువులు సిద్ధం చేయాలని జెసి రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రబీ పంటకు సంబంధించి ఎరువులపై వ్యవసాయ శాఖ అధికారులు, హోల్ సేల్ వ్యాపారస్తులతో సమీక్షించారు. రబీ పంట సాగుకు ఎరువులు 36 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 58 వేల మెట్రిక్ టన్నులు కాంప్లెక్స్ ఎరువులు అవసరం కాగా, యూరియా అధికంగా వినియోగించే వారికి అవగాహన కల్పించి, రైతులందరికీ యూరియా అందేలా చూడాలని తెలిపారు. డిసెంబర్‌లో 3,600 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం కాగా, ఇప్పటికే 8,300 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వ ఉంచటం జరిగిందన్నారు. రైతులెవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పుష్కలంగా యూరియా ఉందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, హోల్ సేల్స్ వ్యాపారస్తులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మా ప్రాంతంలో చెత్త వేయొద్దు

**గ్రామస్తుల ఆందోళన**

ప్రజాశక్తి - నరసాపురం

మా ప్రాంతంలో పట్టణంలో సేకరించిన చెత్తను వేయొద్దంటూ బుధవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. రుస్తుంబాద గ్రామంలోని మండవారి గరువు వద్ద ఖాళీ స్థలంలో చెత్త వేసేందుకు వచ్చిన లారీని ప్రజలు అడ్డుకున్నారు. ఇక్కడ చెత్త వేస్తే ఊరుకోమని హెచ్చరించారు. దీంతో చెత్త వేసేందుకు వచ్చిన లారీ వెనుదిరిగింది. నివాసిత ప్రాంతాల సమీపంలో చెత్త వేయడం వల్ల ప్రజలు అనారోగ్యంబారిన పడే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు చెత్త డంపింగ్ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు కోచ్‌గా సూర్యనారాయణ

ప్రజాశక్తి - తణుకు

హర్యానాలో ఈనెల 27 నుండి 30వ తేదీ వరకు జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే అండర్-19 ఆంధ్రప్రదేశ్ జట్టు కోచ్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండపాక ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణ నియమిస్తూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుండి ఉత్తర్వులు అందినట్లు హెచ్‌ఎం కె.ఫణిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండపాక పాఠశాలలో పనిచేస్తూ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఐదోసారి ఎంపికైన సూర్యనారాయణను గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరు రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ జి.నగేష్, గ్రామ నాయకులు అభినందించారు.

## వృద్ధురాలికి గ్యాస్ పొయ్యి, మంచినీటి సౌకర్యం

**యలమంచిలి :** ఓ వృద్ధురాలి పరిస్థితి చూసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చలించిపోయారు. యలమంచిలి గ్రామంలో పూరింట్లో నివసిస్తున్న ఓ వృద్ధురాలికి గత నెల ఒకటో తేదీన పెన్షన్ అందించేందుకు నిమ్మల ఆమె ఇంటికి వెళ్లగా అక్కడి పరిస్థితులు చూసి చలించి పోయారు. ఇంట్లో కట్టెల పొయ్యితో వంట చేస్తూ కనిపించిన ఆమె ఆర్థిక పరిస్థితి ఆయనను కదిలించింది. తాగునీటి కుళాయి కనెక్షన్ కూడా లేదు. వెంటనే స్పందించిన మంత్రి రామానాయుడు ధర్మారం ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి నేడు నెరవేర్చారు. గ్యాస్ కనెక్షన్ ఇప్పించి గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలిండర్ ఏర్పాటు చేశారు. మోటార్ తో సహా కుళాయి కనెక్షన్ కూడా ఏర్పాటు చేశారు.